‘కిసాన్ సమ్మాన్’తో రైతుకు భరోసా

- కేంద్ర సహాయ మంత్రి వీ సోమన్న
- జమ్మికుంట కేవీకేలో కార్యక్రమానికి హాజరు

మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి సోమన్న

మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

జమ్మికుంట, జూన్ 18: రైతుల ఆర్థికాభివృద్ధికి చేయూతనిచ్చేందుకే పీఎం కిసాన్ సమ్మాన్ యోజన తీసుకువచ్చామని, ఈ స్కీంతో రైతుకు భరోసాగా నిలుస్తున్నదని కేంద్ర జలశక్తి, రైల్వేశాఖల సహాయ మంత్రి వీ సోమన్న పేర్కొన్నారు. 17వ విడుత కిసాన్ సమ్మాన్ నిధులను మంగళవారం వారణాసిలో ప్రధాని మోదీ విడుదల చేయగా, అందుకు సంబంధించిన ప్రత్యక్ష ప్రసారాన్ని జమ్మికుంట కేవీకేలో వీక్షించేందుకు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా ఆయన హాజరై, మాట్లాడారు. కిసాన్ సమ్మాన్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. 2019లో పథకం ప్రారంభం కాగా, ఇప్పటి వరకు రైతులకు రూ.20వేల కోట్లు విడుదల చేశామని చెప్పారు. అంతకుముందు కేంద్ర మంత్రికి కేవీకే ఆధ్వర్యంలో అధికారులు, రైతులు ఘన స్వాగతం పలికారు. కేవీకే రైతులకు అందిస్తున్న సాంకేతిక సాగులో నైపుణ్యాలను చూశారు. సేంద్రియ సాగు చేస్తున్న రైతుల స్టాల్స్ పరిశీలించారు.

రైతులకు రూ.75వేల కోట్లిచ్చిన ఘనత కేసీఆర్‌దే: ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

కిసాన్ సమ్మాన్ యోజన కింద 29రాష్ట్రాలకు రూ.20వేల కోట్లిస్తే, రాష్ట్రంలోని రైతాంగానికి రూ.75వేల కోట్లిచ్చిన ఘనత తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌దని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి కొనియాడారు. సీఎంగా కేసీఆర్ రైతు బంధు, రైతుబీమా, 24గంటల విద్యుత్, కాళేశ్వరం ప్రాజెక్టుతో సాగునీటికి ఇబ్బంది లేకుండా చేశారని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలే దేశంలో అమలు చేస్తున్నారని చెప్పారు. కేంద్రం అమలు చేస్తున్న కిసాన్ సమ్మాన్ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కేవీకే ప్రధాన కార్యదర్శి విజయ గోపాల్‌రెడ్డి, ఐసీఆర్ డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్ మీరా, కేవీకే సీనియర్ శాస్త్రవేత్త, హెడ్ వెంకటేశ్వర్‌రావు, శాస్త్రవేత్తలు విజయ్, ప్రశాంతి, ప్రభాకర్, శ్రీనివాస్‌రెడ్డి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

బిజిగిరిషరీఫ్ దర్గా అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి
- ఉర్సు సందర్భంగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

జమ్మికుంట: దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

జమ్మికుంట, జూన్ 18: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే బిజిగిరిషరీఫ్ దర్గా అభివృద్ధికి కృషి చేస్తానని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హామీ ఇచ్చారు. మండలంలోని బిజిగిరిషరీఫ్ దర్గా ఉర్సు ఉత్సవాలు దర్గా కమిటీ అధ్యక్షుడు ఎండీ ఇక్బాల్, సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం ఎమ్మెల్యే, జడ్పీ చైర్‌పర్సన్ విజయ, తదితరులతో కలిసి దర్గాను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దర్గాలోని హజ్రత్ సయ్యద్ ఇంకుషావళి రహమతుల్లా సమాధులకు చాదర్లు సమర్పించారు. మత గురువు మౌలానా యాసిన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దర్గా ఉర్సు సందర్భంగా భక్తులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. బాబా ఆశీస్సులతో నియోజకవర్గంలోని ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. ప్రజా సమస్యలపై నిత్యం స్పందిస్తానని పేర్కొన్నారు. అంతకుముందు మంగళవారం తెల్లవారుజామున సంధల్ పండుగ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భారీ సంఖ్యలో హాజరైన భక్తులు దర్గాలోని బాబా సమాధులను దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పట్టణ సీఐ రవి ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ జాతరకు హాజరు

హుజూరాబాద్ రూరల్, జూన్ 18: కందుగుల గ్రామంలో గౌడకులస్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎల్లమ్మ జాతరకు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆయనవెంట సర్పంచ్ ప్రభావతి, హుజూరాబాద్ సింగిల్ విండో చైర్మన్ కొండల్‌రెడ్డి, ఎంపీటీసీ పద్మ, వార్డు సభ్యుడు సతీశ్, బీఆర్ఎస్ నాయకులు సంగెం ఐలన్న, రమణారెడ్డి, వెంకటేశ్‌తో పాటు తదితరులు ఉన్నారు.

పథకాల కొనసాగింపునకు కట్టుబడి ఉన్నాం

- ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ
- లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

శంకరపట్నం: మండల పరిషత్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

శంకరపట్నం, జూన్ 18: ఖజానా ఖాళీగా ఉన్నా సంక్షేమ పథకాల అమలుకు కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పునరుద్ఘాటించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో 22 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, ఐదుగురికి షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2004లో డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంలో మొదలుపెట్టిన పథకాలు ఇప్పటి వరకు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతున్నా ఆరు గ్యారెంటీల అమలులో రాజీపడబోమని స్పష్టం చేశారు. పైసా పైసా కూడబెట్టి ఇటీవల రైతుబంధు వేశామని తెలిపారు. సమస్యలపై ప్రజాపాలనలో అందిన దరఖాస్తుల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. పలు కారణాల వల్ల పథకంలో పేరు రాని ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉమ్మెంతల సరోజన, జడ్పీటీసీ లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ అనుపమ, ఎంపీడీవో శ్రీవాణి, ఎంపీటీసీలు, మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

తాడికల్ రేణుకా ఎల్లమ్మ జాతరకు హాజరు

తాడికల్ రేణుకా ఎల్లమ్మ తల్లి జాతరకు మంగళవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఇక్కడ మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, గౌడ కుల సంఘం పెద్దలు, తదితరులు ఉన్నారు.

లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మానకొండూర్ రూరల్, జూన్ 18: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. దాదాపు 75 మంది లబ్ధిదారులకు రూ.73,00,468 విలువైన చెక్కులు అందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ రాజు, నాయకులు నందగిరి రవీందర్రాచారి, ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, గసిగంటి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

తిమ్మాపూర్, జూన్18: మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల పంచాయతీరాజ్ ఏఈలు, ఈఈలు, డీఈలు, ఎస్ఈతో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సమీక్షా సమావేశం నిర్వహించారు. అన్ని మండలాల్లోని రోడ్లు, పెండింగ్ పనులపై చర్చించి, త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అలాగే పలు అభివృద్ధి పనులకు రూ.60 కోట్లతో ప్రతిపాదనలు పంపిస్తే మంత్రి సీతక్కతో మంజూరు చేయిస్తానని అధికారులకు చెప్పారు.

ఆర్టీసీ సిబ్బందిని సన్మానించిన మంత్రి

ఆర్టీసీ సిబ్బందిని సన్మానిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ పమేలా సత్పతి

తెలంగాణచౌక్, జూన్ 18: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం ఒడిశా రాష్ట్రానికి చెందిన వలస కూలీ కుమారికి ప్రసవం చేసిన ఆర్టీసీ సిబ్బందిని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఘనంగా సన్మానించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో సమీక్షలో పాల్గొన్న మంత్రి.. అత్యవసరంగా ప్రసవం కోసం ఏర్పాట్లు చేసిన స్టేషన్ మేనేజర్ అంజయ్య, ప్రసవం చేసిన ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సైదమ్మ, రేణుక, భవాని, లావణ్యను కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సమక్షంలో శాలువాలతో సన్మానించారు. ప్రోత్సాహక బహుమతిగా రూ.5వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వలసకూలీ కుమారికి మానవతా దృక్పథంతో ప్రసవం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ జోనల్ ఈడీ వినోద్‌కుమార్, ఆర్ఎం సుచరిత, డిప్యూటీ ఆర్ఎం భూపతిరెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

‘ఆన్‌లైన్ ఎంట్రీలో తప్పిదాలతో అందని పథకాలు’

శంకరపట్నం, జూన్ 18: ఆన్‌లైన్ ఎంట్రీ సందర్భంగా ఆపరేటర్లు చేసిన తప్పిదాలతో అర్హులైనప్పటికీ పలువురు ప్రభుత్వ పథకాలకు నోచుకోవడం లేదని బీజేపీ నాయకులు ఆరోపించారు. మంగళవారం బీజేపీ నాయకులు రాసమల్ల శ్రీనివాస్, పోతునూరి రాజు ఎంపీడీవో శ్రీవాణికి వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఆరు గ్యారెంటీల అమలుకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటికైనా ఇలాంటి తప్పిదాలను గుర్తించి, అర్హులు నష్టపోకుండా దిద్దుబాటు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

ఇల్లందకుంట, జూన్ 18: మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టిన పలు ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ పూర్తి చేసినట్లు డీఆర్‌డీవో శ్రీధర్ తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో 8వ విడుత సామాజిక తనిఖీలో భాగంగా ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక తనిఖీ బృందం అందించిన వివరాలను పరిశీలించారు. ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు ఉపాధి హామీ పనులపై పలు సూచనలు చేశారు. అనంతరం డీఆర్‌డీవో మాట్లాడుతూ.. ఉపాధి హామీలో రోడ్డుకిరువైపులా నాటిన మొక్కలు రైతులు పంట వ్యర్థాలు కాల్చే క్రమంలో దగ్ధం అవుతున్నాయని, దీనిని నివారించేందుకు వారికి అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో చెరువులు, కుంటల్లో కొందరు అనుమతులు లేకుండా ఎక్స్‌కవేటర్లతో మట్టి తీస్తున్నారని, అలాంటి వారిపై కేసు నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ఇక్కడ అడిషనల్ డీఆర్‌డీవో సంధ్యారాణి, ఎంపీడీవో పుల్లయ్య, విజిలెన్స్ అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్ఆర్‌పీ పాండురంగ, ఎంపీవో వెంకటేశ్వర్లు, ఏపీవో రవికుమార్, టీఏలు, ఎఫ్ఏలు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

20 నుంచి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

విద్యానగర్, జూన్ 18: ఈ నెల 20న జరిగే జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లాలో ఉన్న 1 నుంచి 19 సంవత్సరాలు గల 3,47,523 మంది పిల్లల కోసం 3,48,900 ఆల్బెండజోల్ మాత్రలను అన్ని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలకు పంపిణీ చేయనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20న దగ్గరలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని కోరారు. 20న మాత్రలు తీసుకోని వారికి 27న వేస్తారని తెలిపారు.

ఈజీఎస్ పనుల పరిశీలన

చిగురుమామిడి, జూన్ 18 : మండలంలోని వివిధ గ్రామాల్లో ఈజీఎస్ పనులను మంగళవారం ఎంపీడీవో మధుసూదన్ పరిశీలించారు. చిగురుమామిడి, ముల్కనూర్, సీతారాంపూర్ తదితర గ్రామాల్లోని నర్సరీలు పరిశీలించి, వాటి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. జాబ్ కార్డు కలిగిన వారందరికీ ఉపాధి హామీ పని కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఆయనవెంట పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.

ఏఎస్ఐ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెక్కు అందజేత

చెక్కు అందజేస్తున్న అడిషనల్ డీసీపీ

రాంనగర్, జూన్ 18: కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ కిషన్ ఇటీవల గుండెపోటుతో మరణించగా, ఆయన కుటుంబానికి భద్రత పథకం నుంచి ఎనిమిది లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా మంజూరైంది. ఈ మేరకు చెక్కును ఏఎస్ఐ కిషన్ భార్య లక్ష్మికి మంగళవారం అడిషనల్ డీసీపీ ఏ లక్ష్మీనారాయణ అందజేశారు.

హోంగార్డుకు వెల్ఫేర్ ఫండ్ చెక్కు పంపిణీ

హుజూరాబాద్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డ్‌గా విధులు నిర్వర్తిస్తున్న సంపత్ జనవరిలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. శస్త్రచికిత్స అనంతరం ఇటీవలే కోలుకున్నాడు. సంపత్‌కు మంగళవారం అడిషనల్ డీసీపీ ఏ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా హోమ్ గార్డ్ వెల్ఫేర్ ఫండ్ నుంచి పదివేల రూపాయల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఆర్.ఐ. హోమ్ గార్డ్స్ రజినీకాంత్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దేశీ బృందం విజ్ఞాన కేంద్రం సందర్శన

కేంద్రంలో దేశీ డీలర్లు, అధికారులు

తిమ్మాపూర్, జూన్ 18: జిల్లా దేశీ బృంద సభ్యులు జమ్మికుంటలోని ప్రకాశం విజ్ఞాన దేశీకేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా బోర్డయాక్స్ మిశ్రమం, వానపాముల ఎరువుల తయారీ తదితర అంశాలపై దేశీ ఫెసిలిటేటర్ రాంచందర్‌రావు వివరించారు. పర్యటనలో రైతు శిక్షణ కేంద్రం డీడీఏ ఛత్రు నాయక్, ఏవో మమత, దేశీ బృంద సభ్యులు పాల్గొన్నారు.

అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

తెలంగాణచౌక్, జూన్ 18: నగరంలో ప్రభుత్వ అనుమతి లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ మంగవారం కలెక్టర్‌కు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. విద్యాహక్కు చట్టం అమలును ప్రైవేట్ విద్యాసంస్థలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పాఠశాలలపై అధికారులు చర్యలు చేపట్టని యెడల దశల వారీగా ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

గాండ్ల కులస్తులను ఆదుకోవాలి

తెలంగాణచౌక్, జూన్ 18: గాండ్ల కులస్తులను ఆదుకోవాలని గాండ్ల తిలకుల సంఘం జిల్లా అధ్యక్షుడు జక్కం సంపత్, ప్రధాన కార్యదర్శి జక్కం పుల్లయ్య, కోశాధికారి గుజ్జేటి రవీందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. నగరంలోని సంఘ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ, నేడు ఆధునిక నూనె మిల్లులతో తమకుల వృత్తి నిర్వీర్యమైందని ఆవేదన వ్యక్తం చేశారు. కులవృత్తి లేక జీవనోపాధి కోల్పోయి ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. సమావేశంలో మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కవిత, ప్రధాన కార్యదర్శి జ్యోతి, సలహాదారు శ్రీధర్ పాల్గొన్నారు.

ఎలగందుల మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

కొత్తపల్లి, జూన్ 18 : మండలంలోని ఎలగందుల మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్ష ఫలితాల్లో అద్భుత ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ వీ సరిత పేర్కొన్నారు. మోడల్ స్కూల్‌కు చెందిన పది మంది విద్యార్థులు ఉపకార వేతనానికి ఎంపికై పాఠశాలను జిల్లాలో మొదటి స్థానంలో నిలిపారన్నారు. ఎస్ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులకు 9 నుంచి 12వ తరగతి వరకు ప్రతి సంవత్సరం రూ.12 వేల స్కాలర్‌షిప్ అందిస్తారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో, ప్రిన్సిపాల్ అభినందించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

మొలంగూర్ క్రాస్ రోడ్డు వద్ద గ్రానైట్ లారీ నుంచి జారిపడ్డ బండరాయి

శంకరపట్నం, జూన్ 18: మండలంలోని మొలంగూర్ క్రాస్ రోడ్డు వద్ద ఓ గ్రానైట్ లారీ నుంచి బండరాయి జారి పడగా త్రుటిలో ప్రమాదం తప్పింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. మంగళవారం మధ్యాహ్నం కొత్తగట్టు శివారులోని పెద్దగట్టు గుట్ట నుంచి ఓ పెద్ద బండరాయి లోడ్‌తో గల గ్రానైట్ లారీ బావుపేట్‌కు వెళ్తున్నది. ఈ క్రమంలో లారీ మొలంగూర్ క్రాస్ రోడ్డు వద్దకు రాగానే తారు రోడ్డును ఆనుకుని ఉన్న మొరం గుంతలో దిగబడింది. లారీలోని పెద్ద బండరాయి రోడ్డుపై జారి పడింది. దీంతో పలువురు స్థానికులు, వాహనదారులు హడలిపోయారు. ఇక్కడే రోడ్డు పక్కన హోటళ్లు ఉండగా, వాటి ముందర పలు వాహనాలకు సమీపంలో రాయి జారి పడడంతో అతి పెద్ద ప్రమాదం తప్పినట్లైంది. కనీస జాగ్రత్తలు లేకుండా గ్రానైట్ వ్యాపారులు లారీలో గ్రానైట్ తరలించడంపై స్థానికులు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

డంప్ యార్డును తొలగించాలని మంత్రికి వినతి

మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ పడిశెట్టి భూమయ్య, డివిజన్ నాయకులు

తెలంగాణచౌక్, జూన్18: కోతిరాంపూర్‌లోని బైపాస్ ఎల్లమ్మ గుడి పరిసరాల ప్రాంతంలో గల డంప్ యార్డును శాశ్వతంగా తొలగించాలని తొమ్మిదో డివిజన్ మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి పడిశెట్టి భూమయ్య ఆధ్వర్యంలో డివిజన్ నాయకులు.. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశానికి హాజరైన మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. పాత రాంపూర్ గ్రామ పంచాయతీ కోసం ఏర్పాటు చేసిన డంప్ యార్డుకు కార్పొరేషన్ ఏర్పడిన తర్వాత కూడా నగరంలోని చెత్తనంతటినీ తరలిచడం వల్ల అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. వేసవి కాలంలో డంప్ యార్డులో నిప్పుంటుకొని కాలుష్యంతో కాలనీ వాసులు అనారోగ్యానికి గురవుతున్నారని, రోడ్డు మీద పొగ దట్టంగా కమ్ముకోవడం వల్ల ప్రమాదాలు జరుతున్నాయని తెలిపారు. కాగా, డంప్ యార్డును తొలగించాలన్న తమ విజ్ఞప్తికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు మాజీ కార్పొరేటర్ పడిశెట్టి భూమయ్య తెలిపారు. ఇక్కడ తొమ్మిదో డివిజన్ నాయకులు ప్రసాద్, రవీందర్‌గౌడ్, నాగరాజ్, ఆంజనేయులు, కిరణ్, మహేందర్ ఉన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ కౌన్సిలర్ల ఫిర్యాదు

ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై దుష్ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న కౌన్సిలర్లు

హుజూరాబాద్ రూరల్, జూన్ 18: ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలంటూ హుజూరాబాద్ మున్సిపల్ కౌన్సిలర్లు మంగళవారం హుజూరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక శ్రీనివాస్ మాట్లాడుతూ, కాంగ్రెస్ నాయకులు నేరెళ్ల మహేందర్ గౌడ్, పత్తి కృష్ణారెడ్డి, తిప్పారపు సంపత్, సామల రాజిరెడ్డి, దేశిని కోటి, తుమ్మేటి సమ్మిరెడ్డి, మహ్మద్ బాబా.. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై ఆధారాలు లేని నిందలు వేస్తూ, పరుష పదజాలంతో సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారని, వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేక ఇలాంటి చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. కౌశిక్ రెడ్డి మంత్రి పొన్నం ప్రభాకర్ బూడిద స్కామ్‌ను ఆధారాలతో బట్టబయలు చేయడంతో జీర్ణించుకోలేక సదరు కాంగ్రెస్ నాయకులు ఇలాంటి పనులు చేస్తున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు, కొలిపాక నిర్మల-శ్రీనివాస్, యాదగిరి నాయక్, వనిత-కుమార్, కుమారస్వామి, తిరుమల్ రెడ్డి, ముత్యం రాజు, జీవిత-నరేశ్, స్వప్న-భాస్కర్, కిషన్, రమేశ్, రమాదేవి, మంజుల-కృష్ణ, ఉజ్మా ఇమ్రాన్, సృజన-పూర్ణ చందర్, రాజకొమురమ్మ, తాళ్ల పెల్లి శ్రీనివాస్, లావణ్య, ఉమాదేవి, ఉమామహేశ్వర్ పాల్గొన్నారు.

పోచమ్మ గుడి నిర్మాణానికి విరాళం

గంగాధర, జూన్ 18 : మండలంలోని ఉప్పరమల్యాల గ్రామంలో నూతనంగా చేపట్టిన పోచమ్మ ఆలయ నిర్మాణం కోసం నాయకుడు తూడి లచ్చయ్య మంగళవారం రూ.20 వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అంజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ నాయకులు బొల్లాడి శ్రీనివాస్‌రెడ్డి, ముద్దం నగేశ్, కర్ర బాపురెడ్డి, గ్రామస్తులు ఉన్నారు.

సర్వే పనుల నుంచి అంగన్‌వాడీలను మినహాయించాలి

కలెక్టరేట్, జూన్ 18 : ప్రభుత్వ పథకాలపై సర్వే పనుల నుంచి అంగన్‌వాడీ టీచర్లను మినహాయించాలని అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్ల సంఘం జిల్లా శాఖ డిమాండ్ చేసింది. మంగళవారం ఆ సంఘం జిల్లా శాఖ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో గౌరవాధ్యక్షురాలు అనితాదేవి మాట్లాడుతూ, ఇప్పటికే అంగన్‌వాడీ టీచర్లు పని ఒత్తిడితో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటికి తోడు సర్వే పనులు అప్పగించడంతో వారిలో పనిభారం పెరిగి శారీరక శ్రమతో పాటు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం సత్వరమే స్పందించి మిషన్ భగీరథ పథక లబ్ధిదారుల సర్వే, ఇతర అదనపు పనుల నుంచి విముక్తి కల్పించాలన్నారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు రాధిక, రమ, మణెమ్మ, వెంకటవ్వ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ గోల్డెన్ శాతవాహన నూతన కార్యవర్గం

లయన్స్‌క్లబ్ గోల్డెన్ నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న ప్రతినిధులు

విద్యానగర్, జూన్ 18: లయన్స్‌క్లబ్ గోల్డెన్ శాతవాహన 2024-25 నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా మానువాడ శంకర్, ననువాల గిరిధర్‌రావు, కోశాధికారిగా డాక్టర్ కుంబోజు రమేశ్ ఎన్నికయ్యారు. మొదటి వైస్ ప్రెసిడెంట్‌గా పాశం నర్సింహారెడ్డి, ద్వితీయ వైస్ ప్రెసిడెంట్‌గా చిలుకూరి రాములు, మూడో వైస్ ప్రెసిడెంట్‌గా మమత వేణు, జాయింట్ సెక్రటరీగా బండారి గంగాధర్, మెంబర్‌షిప్ చైర్‌పర్సన్‌గా ఎదుల్ల రాజశేఖర్, ఎల్సీఎఫ్ కోఆర్డినేటర్ అక్కెనపల్లి అజయ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కేబినెట్ సెక్రటరీ శ్రీనివాసరావు, రీజియన్ చైర్‌పర్సన్ గాలిపల్లి వెంకట్, జోనల్ చైర్‌పర్సన్ లయన్ పవనసుతరాజు తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లలో తనిఖీలు

హుజూరాబాద్ రూరల్, జూన్ 18: పట్టణంలోని హోటల్, టిఫిన్ సెంటర్లు, బేకరీలు, వైన్‌షాపుల వద్ద తయారు చేస్తున్న తినుబండారాల నాణ్యతపై మంగళవారం మున్సిపల్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. తినుబండారాల తయారీకి ఉపయోగిస్తున్న ముడి సరుకులు, వాడే నూనెలో నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ మాదారపు కిషన్‌రావు, ఎన్విరాన్‌మెంట్ ఇ